క్లుప్తంగా

భోగేశ్వరంలో రథసప్తమి పూజలు



భోగేశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: రథసప్తమి సందర్భంగా భోగేశ్వరాలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఈఓ రామానుజన్, ఆలయ ప్రధానార్చకుడు శ్యామ్ సుందర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారి మూలమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం నవగ్రహాల్లో సూర్యదేవుడికి విశేష ద్రవ్యాభిషేకం, అలంకరణ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులు స్థానిక కాశీరెడ్డి నాయన ఆశ్రమంలో అన్నప్రసాదాలు స్వీకరించారు.

మూల పెద్దమ్మ ఆలయంలో విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: మండల కేంద్రంలోని మూలపెద్దమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించారు.

చల్లంగ చూడు ఎల్లమ్మ



అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కర్నూలు(రూరల్): నగర సమీపంలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. కుంకుమార్చన, ఆకుపూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

సస్యరక్షణపై రైతులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

కర్నూలు(రూరల్): పంటల సాగులో సస్యరక్షణతో మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు సాలురెడ్డి, రోనాల్డ్ అన్నారు. మండల పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ భవనంలో సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. మట్టి పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేయాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయం చేయడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. కరీఫ్‌లో కంది పంట సాగు చేసిన రైతులను ఆదుకునేందుకు కొనుగోలు కేంద్రాల ద్వారా కందులను క్వింటా రూ.7,550తో కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాధవస్వామి, గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంటు, రైతులు పాల్గొన్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కల్లూరు: గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి సూచించారు. మంగళవారం పర్ల, ఎ.గోకులపాడు గ్రామాల్లో ఎస్‌డబ్ల్యూపీసీ ఎస్‌లు, ఎ.గోకులపాడులో నిర్మాణంలో ఉన్న మినీ గోకులాలను ఎంపీడీఓ పరిశీలించారు. గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ట్రై సైకిల్ ద్వారా చెత్త సంపద కేంద్రానికి తరలించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరుగా అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. చెత్త సంపద కేంద్రాల్లో కాకుండా వీధులు, డ్రైనేజీ కాలువల్లో చెత్త ను వేస్తే పంచాయతీ కార్యదర్శులపై చర్య లు తప్పవని హెచ్చరించారు.

ఎప్పుడొస్తారో తెలీదు.. ఎక్కడుంటారో చెప్పలేం

- సమయపాలన పాటించని పంచాయతీ కార్యదర్శులు
- ఫీల్డ్ వర్క్ అంటూ కాలక్షేపం
- కార్యాలయంలో అందుబాటులో ఉండని వైనం
- విధుల్లో నిర్లక్ష్యం.. పేరుకుపోతున్న సమస్యలు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా పట్టించుకోని అధికారులు



బిలకలగూడూరు సచివాలయం (ఫైల్)



మండలంలోని ఓ సచివాలయంలో ఖాళీగా ఉన్న పంచాయతీ కార్యదర్శి సీటు (ఫైల్)

గడివేముల: మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శుల పనితీరు చాలా విచిత్రంగా ఉంది. సచివాలయంలో ఉంటూ, ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కారించాల్సిన బాధ్యత ఉన్నా.. అదంతా పట్టనట్లు ఉదయం సచివాలయానికి హాజరై వెళ్లిపోతున్నారు. మధ్యాహ్నం గంట మోగితే మండల ఆఫీసులో మీటింగ్ ఉందని, ఆ సార్ పిలుస్తున్నారని, వీసీ ఉందని, ఇలా ఏవో కారణాలు చెప్పి మండల కార్యాలయానికి చేరుకుంటున్నారు. అక్కడ సాయంత్రం వరకు కాలక్షేపం చేసి ఇంటికెళ్తున్నారు. ఇక రూరల్ ప్రాంతాల్లోని మండల కార్యదర్శులు ఏదో ఒక టీ షాపు, హోటల్‌లో కాలక్షేపం చేస్తూ ఇంటికి వెళ్లిపోతున్నారు. దీంతో గ్రామాల్లో ఎక్కడ సమస్యలు అక్కడే పేరుకుపోతున్నాయి. కొందరు కార్యదర్శులైతే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల పరిధిలో మొత్తం 16 పంచాయతీలు, 14 సచివాలయాలు, 14 మంది కార్యదర్శులు పని చేస్తున్నారు. వీరిలో చాలా మంది విధులకు డుమ్మా కొడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ఉదయం నుంచి ఓ గంట పాటు గ్రామ సచివాలయంలో ఉంటున్నారు. మధ్యాహ్నం అయితే మండల కార్యాలయాలకు చేరుకుంటున్నారు. కొందరైతే సచివాయాలయానికి రావడం మానేశారు. ఏ సచివాలయానికి వెళ్లినా ఒకరు, లేదా ఇద్దరు తప్ప కార్యదర్శులు ఉండడం లేదన్న వాదనలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇది తెలిసినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు ఉదయం, సాయంత్ర వేళల్లో హాజరు వేయాల్సి ఉంటుంది. కానీ కొందరు పంచాయతీ కార్యదర్శులు మధ్యాహ్నానికే వెళ్లిపోతున్నారు. మరి కొందరు మీటింగ్‌లు, వీడియో కాన్ఫరెన్స్‌లు, మండల కార్యాలయంలో పని ఉందంటూ, రకరకాల సాకులతో సచివాలయాల నుంచి మెల్లగా జారుకుంటున్నారు. కొందరు ఇంటికి వెళ్లిపోతుండగా.. మరికొందరు పట్టణాలకు, మండల కేంద్రానికి వచ్చి సొంత పనులు చూసుకుంటున్నారు. తోచినప్పుడు బయోమెట్రిక్ వేసి వెళ్లిపోతున్నారు. పల్లె సమస్యలను పట్టించుకోవడం లేదు.

పనివేళలో కానరారు

పంచాయతీ కార్యదర్శులు ఉదయం 10 గంటలకు హాజరు వేయాలి. అయితే చాలా మంది 11 గంటలకు కూడా సచివాలయాలకు చేరుకోవడం లేదు. ఒక వేళ వచ్చినా గంటకు పైగా ఉండడం లేదు. దీన్ని అనువుగా తీసుకొని సచివాలయంలో పనిచేస్తున్న చిన్నస్థాయి ఉద్యోగులు తామేమీ తక్కువ కాదంటూ వాళ్లు కూడా బయట వెళ్లి కాలక్షేపం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం గ్రామ సచివాలయానికి వచ్చే ప్రజలు అధికారులు లేక ఇంటికి తిరిగి వెళ్లిపోతున్నారు.

బాపూజీ కలలకు ప్రతి రూపం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహాత్మాగాంధీ కన్న కలలను ప్రతిరూపాలుగా సచివాలయాలు ఆవిర్భవించాయి. గ్రామ స్వరాజ్యాన్ని ప్రజలకు చేరువ చేయాలన్న లక్ష్యంతో జగనన్న ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ప్రతి సచివాలయంలో గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శితో పాటు వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్, వ్యవసాయ, వెటర్నరీ, ఫిషరీష్, సర్వేయర్లు, వీఆర్వోలు అందుబాటులో ఉంటారు. అవినీతికి తావులేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా సచివాలయాలు పనిచేశాయి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవస్థకు తూట్లు పొడిచి నిర్వీర్యం చేస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ చేసేందుకు ఈ వ్యవస్థలు ఎంతగానో దోహదపడ్డాయి. సచివాలయాల ద్వారా 545 సేవలు ప్రజలకు అందేవి. ప్రస్తుతం కూటమి పాలనలో పరిస్థితులు మారిపోయాయి. పాలనంతా గందరగోళంగా తయారైంది. దీనికి తోడు సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇంత వరకు రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డుల వెబ్‌సైట్లు తెరుచుకోలేదు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

క్యాన్సర్‌పై అవగాహన



క్యాన్సర్ లోగో ఆకారంలో నిలబడిన శాంతిరామ్ ఫార్మసీ విద్యార్థులు

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడమెట్ట వద్ద నున్న శాంతిరామ్ ఫార్మసీ కళాశాలలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవంపై విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మధుసూదన్‌శెట్టి మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన జీవన శైలి, వ్యాయామం, మంచి ఆహారంతో క్యాన్సస్ నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. ఆహారంలో కల్తీ ద్వారా క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని చెప్పారు. అనంతరం విద్యార్థులు క్యాన్సర్ లోగా ఆకారంలో నిలబడి ఆకట్టుకున్నారు.

పెద్దాసుపత్రి ఏడీగా మల్లేశ్వరమ్మ



మల్లేశ్వరమ్మ

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా వై.మల్లేశ్వరమ్మ నియమితులయ్యారు. మంగళవారం ఆమె ఆసుపత్రిలో ఇన్‌చార్జ్ ఏడీ శ్రీనివాసులు నుంచి బాధ్యతలు స్వీకరించారు. 1984లో ఇదే ఆసుపత్రిలో టైపిస్టుగా ఉద్యోగంలో చేరిన ఆమె వైద్య ఆరోగ్య శాఖలో 30 ఏళ్లుగా వివిధ హోదాల్లో పనిచేసి చివరగా ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాలలో ఏఓగా విధులు నిర్వహించారు. ఇటీవల పదోన్నతి పొందారు. ఆమెను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అభినందించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



హెల్త్ క్లినిక్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జగదీష్‌చంద్రారెడ్డి

గడివేముల: ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ప్రజలకు అందుబాటులో ఉండాలని నంద్యాల జిల్లా ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ నోడల్ అధికారి డాక్టర్ జగదీష్‌చంద్రారెడ్డి సూచించారు. మంగళవారం గడివేముల–2లోని విలేజ్ క్లినిక్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆయా గ్రామాల్లో ఓపీ నిర్వహించాలన్నారు. మధ్యాహ్నం నుంచి మంచానికే పరిమితమైన రోగులను పరిశీలించి ఉచితంగా మందులను పంపిణీ చేయాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో జరుగుతున్న కార్యక్రమాలను తనిఖీ చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ కిరణ్‌కుమార్‌కు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనం

ఓర్వకల్లు: మండల పరిధిలోని కడప–కర్నూలు జాతీయ రహదారిపై సోమయాజులపల్లె వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని చెన్నశెట్టిపల్లె గ్రామానికి చెందిన రంగస్వామి(55) గ్రామంలో వ్యవసాయంతో పాటు, బోర్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే సాయంత్రం టీ తాగడానికి ద్విచక్రవాహనంపై సోమయాజులపల్లె బస్సు స్టేజీ వద్దకు వెళ్లాడు. టీతాగి, యూటర్న్ వద్ద సోమయాజులపల్లె గ్రామంలోకి బయలుదేరి, ఆకస్మికంగా హోటల్ వైపు తిరిగాడు. ఈ క్రమంలో నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న బొలెరో వాహనం వేగంగా ఢీకొంది. రంగస్వామి తలకు తీవ్ర గాయమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. చికిత్స నిమిత్తం హైవే పెట్రోలింగ్ అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతానికి బాధితుని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. బాధితునికి భార్య మహేశ్వరమ్మతో పాటు, కూతురు ఉంది. బాధితుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సునీల్ కుమార్ పేర్కొన్నారు.

ఆరోగ్య సేవలను యాప్‌లో నమోదు చేయాలి



మాట్లాడుతున్న మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు

కల్లూరు: ఆశా కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు అందిస్తున్న సేవలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణులకు నాల్గో నెల నుంచి ప్రసవానంతరం బిడ్డకు ఏడాది వచ్చే వరకు మాతాశిశు ఆరోగ్య సంరక్షణ, కిల్కారి మేసేజ్‌ల గురించి అవగాహన కల్పించాలన్నారు. ఐరన్ మాత్రల పంపిణీ, విటమిన్ ఏ ద్రావణం పంపిణీ, నవజాత శిశు సేవల వివరాలను క్రమం తప్పకుండా సంబంధిత యాప్‌లలో నమోదు చేయాలని సూచించారు. చిన్న వయస్సులో గర్భధారణ వల్ల అనర్థాలు, లింగ వివక్షత నిర్మూలన, ఆడపిల్లల ప్రాముఖ్యత, తాత్కాలిక గర్భనిరోధక పద్ధతుల గురించి ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు వివరించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి మోతీలాల్ నాయక్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సస్యరక్షణతో చీడ పురుగుల నుంచి రక్షణ



ముడుమాలలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ

సి.బెళగల్: సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే పంటలను చీడపీడల నుంచి కాపాడుకోవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారిణి (ఏఈఓ) హిమబిందు అన్నారు. మంగళవారం వ్యవసాయ సిబ్బందితో కలిసి మండలంలోని కొండాపురం, ముడుమాల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామ సచివాలయాల్లో రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయంలో సస్యరక్షణ, ఆధునిక వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులను తెలియజేశారు. చీడ పురుగుల ఉధృతిని తెలుసుకునేందుకు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లో వ్యవసాయ పొలాలను సందర్శించి పంట సాగు సమాచారం, సంరక్షణ చర్యలను తెలియజేశారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉండి వైద్య చికిత్స అందించాలని సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. ముఖ్యంగా క్యాజువాలిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో హెచ్‌ఓడీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిలోని ఎన్‌టీఆర్ వైద్యసేవకు సంబంధించిన కొత్త లక్ష్యాలను మరింతగా పెంచి అమలు చేయాలన్నారు. ఈ–హాస్పిటల్ అమలులో పురోగతి సాధించాలని, ఇందులో ప్లాస్టిక్ సర్జరీ విభాగం మంచి ప్రతిభ కనబరిచిందని ప్రశంసించారు. త్వరలో ఆసుపత్రిలో మరో రెండు అదనపు ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో రక్త పరీక్షలకు సంబంధించి అన్ని కిట్లు ఉన్నాయని, అన్ని పరీక్షలు ఇక్కడే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యపరీక్షల విభాగానికి సంబంధించి ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించినట్లు చెప్పారు. ఆసుపత్రి పర్యవేక్షకుల ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో సగటున ప్రతిరోజూ ల్యాబ్‌కు 1700 నుంచి 2 వేల శాంపిల్స్, 6 వేల నుంచి 7వేల పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుకాదేవి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఏడీ మల్లేశ్వరమ్మ, హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

రాజకీయ కక్ష్యలతోనే తప్పుడు కేసులు

- వైఎస్సార్‌సీపీ నాయకుడు సుభాష్ చంద్రబోస్



సీఐకు వినతిపత్రం అందజేస్తున్న సుభాష్ చంద్రబోస్, బాధిత కుటుంబాలు

సి.బెళగల్: రాజకీయ కక్ష్యలతోనే వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దూర్ సుభాష్ చంద్రబోస్ అన్నారు. మంగళవారం బాధిత కుటుంబాలతో కలిసి కోడుమూరు సర్కిల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. సి.బెళగల్ మండలం బ్రాహ్మణదొడ్డి గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై జరిగిన హత్యాయత్నం, దాడులను సీఐ తబ్రేజ్‌కు వివరించారు. బాధితులపైనే హత్యాయత్నం కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. అమాయకులపై అక్రమ కేసులు నమోదు చేశారని సీఐకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ.. బ్రాహ్మణదొడ్డిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ సర్పంచ్ దస్తగిరిని అంతమొందించాలన్న పక్కా ప్రణాళికలతోనే ఈనెల ఒకటో తేదీ టీడీపీ నాయకులు వేటకొడవళ్లు, రాడ్లు, సీసాలతో దాడులకు దిగారన్నారు. తిమ్మన్న, రాముడు సహా పలువురిని తీవ్రంగా గాయపరిచారని తెలిపారు. టీడీపీ దాడి చేస్తున్న క్రమంలో ఆత్మరక్షణగా దాడులను ఎదుర్కొన్న వైఎస్సార్‌సీపీకి చెందిన 15 మందిపైనే హత్యాయత్నం కేసు నమోదు చేయడం దారుణమన్నారు. రానున్న సర్పంచ్ ఎన్నికల్లో పోటీ లేకుండా చేసేందుకు టీడీపీ నాయకులు ఇలాంటి దాడులు చేస్తున్నట్లు ఆరోపించారు. పోలీసులు పూర్తిస్థాయిలో విచారించి అమాయకులపై తప్పుడు కేసులను ఎత్తివేయాలని కోరారు. స్పందించిన సీఐ విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాల్మీకి సంఘం నేత రాంభీం నాయుడు, బాధిత కుటుంబాల మహిళలు ఉన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమి పూజ



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే గౌరు చరిత మంగళవారం సాయంత్రం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ముందుగా స్థానిక బంగ్లా బస్టాండ్ ప్రాంతంలో రూ. 10 లక్షలు జాతీయ ఉపాధి నిధులతో రెండు చోట్ల సీసీరోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణం చేపట్టేందుకు భూమి పూజ చేశారు. అనంతరం ఊరువాకిలి సమీపంలో ఎద్దుల రామేశ్వరమ్మ, శేషాచలంరెడ్డి దంపతులు విరాళంగా ఇచ్చిన రూ.20 లక్షల విలువ చేసే స్థలంలో రూ.24 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించారు. అటు నుంచి ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహం నుంచి లింగమయ్య గుడి వరకు వంద మీటర్ల సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. మీదివేమలు రోడ్డులోని జంగాలపేటలో రూ.25 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రంథాలయ నిర్మాణం కోసం 4 సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఏఈ సురేంద్రారెడ్డి, ఏఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు సకాలంలో బిల్లులు



ఉపాధి సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ

సి.బెళగల్: ఉపాధి హామీ పథకంలో చేపట్టే అభివృద్ధి పనులతో పాటు గోకులం షెడ్ల నిర్మాణ బిల్లుల ను సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నిర్మించిన సీసీరోడ్ల పురోగతి, పెండింగ్ పనులపై ఎంపీడీఓ చర్చించారు. ఆయా గ్రామాల్లో 29 మంది లబ్ధిదారులు నిర్మించుకుంటున్న గోకులం షెడ్ల పనులు, బిల్లుల చెల్లింపు తదితర అంశాలను గ్రామ పంచాయతీల వారీగా తెలుసుకున్నారు. బిల్లుల చెల్లింపులో అలసత్వం వహించొద్దని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా మండలంలో ఉపాధి పనుల కల్పన, కూలీల సంఖ్య, చేపట్టిన పనుల వివరాలను ఏపీఓ రామన్నను అడిగి తెలుసుకున్నారు.

వైభవంగా సుబ్రమణ్యేశ్వరస్వామి షష్టి



స్వామివారి కల్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో సుబ్రమణ్యేశ్వరస్వామి

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లీ సుబ్రమణ్యేశ్వరస్వామి షష్టిని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున నుంచే స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, పుష్పాలంకరణ, నైవేద్య సమర్పణ చేసి కర్పూ నీరాజనాలు పలికారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితా, గౌరు వెంకట్ రెడ్డి దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

షష్టి సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని కల్యాణాన్ని తిలకించారు. అర్చకులు నారాయణస్వామి, సురేష్, స్వామి, సుబ్బయ్య మంత్రోచ్చరణలతో స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. ఈఓ రామక్రిష్ణ స్వామిస్వామికి వస్త్రాలు సమర్పించారు.

‘దుమ్ము’ కొట్టుకుపోవాల్సిందే



కంకర తేలి అధ్వానంగా మారిన పాణ్యం–గోరుకల్లు రోడ్డు



దుమ్ము లేస్తుండగా ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థులు

పాణ్యం: పాణ్యం–గోరుకల్లు గ్రామాల మధ్య రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డు మొత్తం గుంతలు, కంకర తేలి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రెండు గ్రామాల మధ్య 9 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రోడ్డు వెంట పాణ్యం, కొండజుటూరు, గోరుకల్లు మీదుగా దుర్వేశి, గడివేముల, వెలుగోడు తదితర గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. పాణ్యం మొదలుకొని గోరుకల్లు వరకు గుంతలు, కంకర తేలడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రోడ్డుపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. ఒక వాహనం ముందు వెళ్లిందంటే వెనుక వచ్చే వాహనం ఆగాల్సిందే... అంతలా దుమ్ము వస్తుంది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.